క్లుప్తంగా

పగల్‌పత్తు ఉత్సవాలు ప్రారంభం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం పగల్‌పత్తు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పదిరోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి లను విశేషంగా అలంకరించి పల్లకీలో అధిష్టింపజేసి ఆలయ బేడా మండపంలో ఉదయం తిరువీధి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తుల చెంతన దివ్యప్రబంధపారాయణాలు అర్చకులు పఠించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాస మూర్తి స్వామిని దర్శించుకున్నారు.

పంట నష్టంపై సమగ్ర నివేదిక



దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఏడీ రామారావు తదితరులు

సబ్బవరం: తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక అందజేయాలని వ్యవసాయ సిబ్బందికి అనకాపల్లి సబ్ డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం. రామారావు సూచించారు. మండలంలోని అమృతపురం,పెదనాయుడుపాలెం గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటను బుధవారం ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. వరి పైరు 33 శాతానికి పైగా నష్టం వాటిల్లిన ప్రతి రైతు వివరాలు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, ఏఈవో బాలరాజు,గ్రామ వ్యవసాయ సహాయకులు కె. జానకి, పి. బావన,మండల వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ సబ్బవరపు సత్యనారాయణ,గ్రామ పెద్దలు బైలపూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన

పరవాడ: ఫార్మా రసాయన వ్యర్థాల కారణంగా మృతి చెందిన చేపలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. పరవాడ పెద్ద చెరువులో మృతి చెందడం వల్ల నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆయకట్టు రైతులు చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం నాటికి నాలుగో రోజుకు చేరాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెందుర్తి: ఈపీడీసీఎల్ 11కేవీ రాంపురం ఫీడర్‌లో విద్యుత్ లైన్ల నిర్వహణ, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్న కారణంగా పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ప్రసాద్ నగర్, శ్రమశక్తినగర్, 3,4, లాస్ట్ బస్టాప్,బంగారమ్మకాలనీ,సత్యనగర్ ఏరియా, చినముషిడివాడ తదితర ప్రాంతాలకు అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి



ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనుబాబు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలు అభివృద్ధి పనులు తక్షణమే చేపట్టాలని దేవస్థానం ఈవో ఎస్. శ్రీనివాసమూర్తిని బుధవారం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కోరారు. పలు అంశాలతో ఈవోకు వినతిపత్రం అందజేశారు. సింహగిరిపై తిరునామాలు ఏర్పాటు చేయడంతో పాటు సింహాచలం వచ్చే నాలుగుమార్గాల ప్రవేశాల వద్ద స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని భైరవవాకు సరైన రహదారి నిర్మించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.



కళ్ల ముందు కలల సౌధం

- అన్ని వసతులతో నిర్మాణాలు పూర్తి
- నేడు టిడ్కో గృహాలు ప్రారంభం
- లబ్ధిదారుల చేతికి తాళాలు
- పరవాడలో 512 టిడ్కో ఇళ్ల నిర్మాణం
- నిర్మాణ వ్యయం రూ.35.85 కోట్లు

సొంత ఇల్లు ప్రతీ ఒక్కరి కల. ప్రతీ పైసా కూడబెట్టి, ఒక్కో ఇటుక పేర్చి, నిర్మించుకున్న కలల సౌధంలో కుటుంబంతో హాయిగా జీవించాలని ఆకాంక్షిస్తారు. దాని కోసం ఎంతో శ్రమిస్తారు. అయితే, పేదలకు ఆ భారం లేకుండా సొంతింటిని సమకూర్చాలని భావించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ప్రభుత్వ నిధులతో, ఆధునిక వసతులతో టిడ్కో గృహాలను తీర్చిదిద్దారు. పరవాడలో నిర్మించిన గృహ సముదాయాన్ని నేడు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభించనున్నారు. అనంతరం లబ్ధిదారులకు వాటిని అందజేయనున్నారు.

కల్పించిన సౌకర్యాలు

లక్ష లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు	సెప్టిక్ ట్యాంకులు
ఇంటింటి కుళాయి	ఎస్‌టీపీ ట్రీట్‌మెంట్ ప్లాంట్
అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు	పచ్చదనం కోసం 800 మొక్కల పెంపకం
సీసీ రోడ్లు	వీధిలైట్లు



ప్రారంభోత్సవానికి సిద్ధమైన పరవాడ టిడ్కో గృహ సముదాయం

పరవాడ: రాష్ట్రంలోని ఏ ఒక్క పేద కుటుంబం సొంత గూడు లేకుండా ఉండకూడదన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. అందుకనుగుణంగా పేదలకు సొంతిళ్లు నిర్మించి అందించాలని సంకల్పించారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకాన్ని ప్రవేశపెట్టి అర్హులందరికీ గృహయోగం కల్పించారు. మరోవైపు ఏపీ టిడ్కో హౌసింగ్ స్కీం ద్వారా సకల సదుపాయాలతో గృహ సముదాయాలు నిర్మించి అందజేస్తున్నారు. 300 చదరపు అడుగుల ఇళ్లను ఉచితంగా, 365, 430 చదరపు అడుగుల ఇళ్లను రాయితీపై అందిస్తున్నారు. పరవాడ జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ సమీపంలో 521 టిడ్కో గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇళ్లకు సంబంధించి అన్ని పనులు పూర్తి చేశారు. విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. రోడ్లతో పాటు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించారు.

రూపాయికే రిజిస్ట్రేషన్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేవలం ఒక్క రూపాయికే ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించి లబ్ధిదారులకు అప్పగిస్తోంది. పేదలపై ఎటువంటి ఆర్థిక భారం పడకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని కారణంగా వారంతా సంతోషంగా ఉన్నారు.

ఆత్మీయ సత్కారం



బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని సత్కరిస్తున్న పాలిశెట్టి సురేష్ రాజ్

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ధ్యక్షుడిగా నియమితులైన బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని బుధవారం అమరావతిలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అంతకు ముందు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిర్దేశించినట్టు సురేష్‌రాజ్ తెలిపారు.

సంక్షేమం.. అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

ఎంపీపీ బోకం సూర్యకుమారి



మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: ప్రజా సంక్షేమం,రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని నారపాడు సచివాలయం పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు రాపేటి రాము అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.., పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలను అవినీతికి తావులేకుండా ప్రజలకు చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నారపాడులో కోట్లాది రూపాయిలతో పలు సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన పరిపాలనలో నూతన ఒరవడి సృష్టిస్తూ దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మనమంతా మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు, నియోజకవర్గ ప్రతినిధి కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, సర్పంచ్‌లు రామకోటి అప్పారావు, మామిడి శంకరరావు, ఎంపీటీసీ మామిడి లక్ష్మి, పార్టీ అధికార ప్రతినిధి వనం అచ్చెంనాయుడు, సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,రాపేటి రాము,సబ్బవరపు నారాయణమూర్తి, మండల కో ఆప్షన్ సభ్యుడు గొర్లి నూకరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సేనాపతి దుర్గ, ఈవోఆర్‌డీ మహేష్ ,పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడిపై అన్న దాడి



గాయపడ్డ సమ్మంగి కృష్ణ

సబ్బవరం: తీసుకున్న అప్పు తీర్చమన్నందుకు తమ్ముడిపై అన్నదాడి చేసిన ఘటన సబ్బవరం శివారు పెదనాయుడుపాలెంలో చోటు చేసుకోంది. బాధితుడి ఫిర్యాదు మేరకు సబ్బవరం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... గ్రామానికి చెందిన సమ్మంగి దేముడుబాబు, కృష్ణ అన్నదమ్ములు. 18 ఏళ్ల కిందట అన్న దేముడుబాబు ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు సర్దుబాబు చేయమని తమ్ముడు కృష్ణను అడిగాడు. దీంతో కృష్ణ తన వద్ద ఉన్న రూ.50 వేలు ఇచ్చాడు. అయితే ఇటీవల కృష్ణ కొత్తగా ఇల్లు నిర్మాణం ప్రారంభించాడు. తన వద్ద తీసుకున్న రూ.50 వేలతో పాటు ఉమ్మడిగా ఉన్న ఆస్తి పంచాలని కృష్ణ మంగళవారం రాత్రి అన్నను అడిగాడు. ఇది వివాదం కావడంతో అన్న దేముడుబాబుతో పాటు వదిన వెంకటలక్ష్మి,కుమారుడు వినయ్ కలిసి దాడి చేశారు. దీంతో కృష్ణ తల,శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు బుధవారం తన భార్య నూకరత్నంతో కలిసి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రంగనాథం తెలిపారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

అగనంపూడి: విద్యుత్ వినియోగదారుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం కస్టమర్స్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ ఫోరమ్ (సీజీఆర్ఎఫ్) పని చేస్తుందని సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. అగనంపూడి సెక్షన్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు. సత్వరం న్యాయం జరగాలంటే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని, లేదా సీజీఆర్ఎఫ్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఫోరమ్‌కు ఇప్పటి వరకు 7713 ఫిర్యాదులు అందగా వాటిలో 7583 సమస్యలు పరిష్కారం అయ్యాయని,కేవలం 130 సమస్యలు మిగిలి ఉన్నాయన్నారు. ఏపీఈపీడీసీఎల్ (ఆర్ఈసీఎస్) డీఈ రామకృష్ణ, అగనంపూడి డీపీఈ డి.ఎస్.ఎస్.ప్రసాద్, సీజీఆర్ఎఫ్ సభ్యులు ఎస్.హరిబాబు, వై.శ్రీధర్‌కుమార్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. అగనంపూడి సెక్టార్–1లో ఇండోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, నెల్లి శ్రీనివాసరావు, కె.అప్పారావు సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణను కోరారు.

గాంధీతత్వం అలవర్చుకోవాలి



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు బాలమోహన్‌దాస్, సుదర్శన్‌రావు

మద్దిలపాలెం : మహాత్మా గాంధీ తత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ తత్వంపై బుధవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఉప కులపతి ఆచార్య కె.బాలమోహన్‌దాస్, విక్రమ్ సింహపురి విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి ఆర్.సుదర్శన్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుడుతూ గాంధీ తత్వం గురించి వివరించారు. మానవత విలువలను విద్యార్థులు గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, కళా భారతి కార్యదర్శి వి.ఆర్.కె.రాంబాబు, రమణమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ప్రత్యేక యోగ తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి జనరల్, స్థూలకాయ, థెరపటిక్, వెన్నునొప్పి, మెడనొప్పి నివారణకు ప్రత్యేక యోగా శిబిరాలు నిర్వహించనున్నట్టు కేంద్రం గౌరవ సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 93980 19922, 94944 01919, 83743 51324 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు యోగా తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.

31న రెడ్డి కుటుంబ ఆత్మీయ కలయిక



కరపత్రం ఆవిష్కరించిన రమేష్‌రెడ్డి, వేమన సంఘం ప్రతినిధులు

సీతమ్మధార : వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన రెడ్డి కుటుంబ ఆత్మీయ కలయిక సంబంధించిన పోస్టర్‌ను బుధవారం సీతమ్మధారలోని స్వాతి ప్రమోటర్స్ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎం.డి.మేడపాటి రమేష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఈ నెల 31వతేదీన ఆదివారం ముడసర్లోవలోని (రోజ్‌గార్డెన్స్)ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం వరకు ఆత్మీయ కలయిక నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అలాగే ఆహ్వాన పత్రికను మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ సత్తిరామకృష్ణారెడ్డికి సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో నందిరెడ్డి బాలిరెడ్డి, నీలాపు రమణరెడ్డి, మరడ శ్రీనివాస రెడ్డి, కర్రి రామారెడ్డి, ఎస్.సంజీవరెడ్డి, దల్లి రామ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విలువైన వస్తువులు జాగ్రత్తగా చూసుకోండి'

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దర్శనానికి విచ్చేసే భక్తులు విలువైన వస్తువులు, మనీపర్స్‌లు, హ్యాండ్ బ్యాగులు, సెల్‌ఫోన్లు జాగ్రత్తగా చూసుకోవాలని వన్‌టౌన్ క్రైమ్ ఎస్ఐ ఎస్. రామ్మూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టూవీలర్స్ పార్క్ చేసేటప్పుడు హ్యాండిల్ లాక్ సరిగ్గా వేసుకోవాలని, క్యూలైన్లలో మీకు తెలియకుండానే మీ హ్యాండ్ బ్యాగుల నుంచి విలువైన వస్తువులు దోచుకుపోతారని, మీ మెడలో ఉన్న వస్తువులు మీకు తెలియకుండానే రద్దీగా ఉండేటప్పుడు తెంపుకుపోతారని చెప్పారు. నిర్మానుష్యంగా ఉండే ప్రదేశాల్లోకి వెళ్లేటప్పుడు కూడా మీ వస్త్రాన్ని మెడపై ధరించి వెళ్లాలని, ఆలయ పరిసర ప్రాంతాలు, క్యూలైన్లలో సీసీ కెమెరా నిఘాను పర్యవేక్షించడానికి కమాండ్ కంట్రోల్ కూడా ఏర్పాటు చేశామన్నారు. క్రైం పోలీసులు యూనిఫాం, మఫ్టీలో పర్యవేక్షిస్తుంటారని, ఎవరైనా అనుమానంగా ఉన్నట్టు కనిపించినా, దొంగతనం చేసినట్టు చూసినా సమీపంలో గల పోలీసులకు అప్పగించాలని ఎస్ఐ రామ్మూర్తి పేర్కొన్నారు.

వినూత్న కథాంశంతో 'లతమరబా'



లతమరబా నాటికలో ఆకట్టుకున్న సన్నివేశం

మద్దిలపాలెం : జానపద కథ ఆధారంగా రచించిన నాటిక లతమరబా. ఎదురుకాళ్లతో పుట్టిన బిడ్డ భవిష్యత్ ఆధారంగా సాగిన వినూత్న కథాంశం ఇది. అసాధారణ శక్తులు ఎదురుకాళ్లతో పుట్టిన బిడ్డకు ఉంటాయనే విశ్వాసంతో కథను ఎంతో చక్కగా రక్తికట్టించారు. ఈ నాటిక తిలకిస్తున్న ప్రేక్షకులు తనయత్వానికి లోనయ్యారు. రసజ్ఞ జాతీయ భాషా నాటకోత్సవాలలో భాగంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో బుధవారం లతమరబా నాటికను ప్రదర్శించారు. దీనికి నీరజ్‌కుమార్ దర్శకతం వహించగా రోషని ప్రసాద్ మిశ్ర రచించారు.

వెటర్నరీ వైద్యుడి పోస్టు భర్తీకి చర్యలు

ఆరిలోవ: జూలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఒక వెటర్నరీ వైద్యుడి పోస్టు భర్తీ చేయనున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం ఈ నెల 20 సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నెలకు రూ.50 వేలు వేతనం చెల్లించనున్నామని, ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు జూ క్యూరేటర్ ఆఫీస్‌లో నేరుగా దరఖాస్తు అందజేయాలన్నారు.

18న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవం

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24 వార్డు నక్కవానిపాలెంలో శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి షష్టి మహోత్సవాన్ని ఈ నెల 18న నిర్వహించనున్నట్టు కార్యనిర్వాహణాధికారి శేఖర్‌బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆలయ ఆవరణలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో పూజలు నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరువీధి మహోత్సవం, సాయంత్రం 6.30 గంటల నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సం జరగనుందన్నారు. స్వామి వారి కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.300 రుసుము చెల్లించాలన్నారు. ఈ కార్య క్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ నక్క అప్పలరెడ్డి, సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిల్మ్ మేకింగ్‌లో వర్క్‌షాపు నిర్వహిస్తా



ఎల్.బి.శ్రీరామ్‌తో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతమ్మధార : నగరంలోని పలు కార్యక్రమల్లో పాల్గొనడానికి వచ్చిన సీనియర్ నటుడు ఎల్.బి.శ్రీరామ్‌ను బుధవారం గురుద్వార్ దరి ఓ హోటల్‌లో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్యదర్శి నరవ ప్రకాష్ మాట్లాడుతూ సినియాల్లో నటించకున్న లఘు చిత్రాల నిర్మాణం ద్వారా యువతకు మార్గదర్శకంగా ఉన్నారని అభినందించారు. విశాఖలో లఘు చిత్రాల నిర్మాణం అంశంపై వర్క్‌షాపు నిర్వహించాలని కోరారు. ఎల్.బి. శ్రీరామ్ మాట్లాడుతూ చిత్ర నిర్మాణానికి అవసరమైన అన్ని హంగులు విశాఖలో ఉన్నాయని ప్రభుత్వం ఆ దిశగా అడుగులు ముందుకు వేయాలన్నారు. అందుకు తనవంతు ఫిల్మ్ మేకింగ్ వర్క్‌షాపు నిర్వహించే ఆలోచన ఉందన్నారు. ఈకార్యక్రమంలో సూర్యప్రకాష్ రావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ట్రాన్స్‌పోర్టు కంపెనీలకు నోటీసులు



కలపాకలో బొగ్గు లారీలను పరిశీలిస్తున్న పీసీబీ అధికారి శ్యామ్‌వర్ధన్

పరవాడ: కాలుష్యానికి కారణమైన నాలుగు ట్రాన్స్‌పోర్టు కంపెనీలను గుర్తించి నోటీసులు జారీ చేసినట్టు కాలుష్య నియంత్రణ మండలి అధికారి శ్యామ్‌వర్ధన్ తెలిపారు. గత నెల 15న వెన్నలపాలెంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో బొగ్గు లారీల కాలుష్యం నిర్మూలించాలని మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టికి ఫిర్యాదు చేశారు. స్పందించిన పీసీబీ అధికారులు మంగళవారం పలు లారీలను పరిశీలించారు. అధిక సామర్థ్యంతో రాకపోకలు సాగిస్తున్న బొగ్గు, బూడిదల లారీలను గుర్తించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పీసీబీ అధికారి శ్యామ్‌వర్ధన్ చెప్పారు. ఆయన వెంట మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు ఉన్నారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్‌కు ఆరిపాక విద్యార్థులు



రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్‌కు ఎంపికైన ఆరిపాక జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ నెల 14,15వ తేదీల్లో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. నాగమల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ నెల 11, 12వ తేదీల్లో భీమిలిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ చూపారన్నారు. జానపద నృత్యంలో పి. మోహన్, సాంప్రదాయ వాద్య,సంగీత విభాగంలో పి. సందీప్, త్రీడి బొమ్మల తయారీలో ఎస్. చైతన్య, సంప్రదాయ బొమ్మల తయారీలో పి. జితేంద్ర, నటనలో పి. గ్రీష్మంత్,వి. మీనాక్షి విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఆ విద్యార్థులను బుధవారం పాఠశాల హెచ్ఎం మల్లేశ్వరరావుతో పాటు పీడీ రామలక్ష్మి, మిగిలిన సిబ్బంది అభినందించారు.

'విశాఖ ఉక్కు' పేరు కనిపించకుండా కుట్ర



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: ఆర్ఐఎన్ఎల్ బ్రాండ్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలో ఎక్కడా కనిపించకుండా, కేవలం కన్వర్షన్ ఏజెంట్‌గా మాత్రమే ప్లాంటును నడిపి, సంస్థకు లాభాలు లేకుండా చేయాలని కేంద్రప్రభుత్వం చూస్తోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కార్పొరేట్ క్రీడలకు విశాఖ ఉక్కు పరిశ్రమను వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1035వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన సింటర్ ప్లాంట్ విభాగ కార్మికులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సెయిల్ కంపెనీ టీఎంటీతో కోల్‌కత్తాలో సమావేశం నిర్వహించిందని, 90వేల టన్నులు ఉత్పత్తిని 45 రోజుల్లో ఇవ్వాలని అడుగుతున్నారన్నారు. దీనికి బదులు కన్వర్షన్ చార్జెస్ 18 వేల రూపాయలు ఇస్తారని, దీనినే బయట 52 వేల రూపాయలకు అమ్ముతారని, టీఎంటీ బార్‌పై సెయిల్ ఎంబోజింగ్ వేసి ఇవ్వాలని, ఆర్ఐఎన్ఎల్ నుండి ఒకరు నోడల్ ఆఫీసర్‌గా ఉంటారని తెలిపారు. ఇప్పటికే ఇతర రాష్ట్రాలోని దూరప్రాంతాల్లో ఉన్న ఆర్ఐఎన్ఎల్ ఆఫీసులు మూసివేయాలని అదేశాలు జారీ చేశారని, 58 ఏళ్లు వచ్చిన వారికి ఉద్వాసన పలకాలని, మెడికల్‌గా అన్‌ఫిట్ అయిన వారికి ఇచ్చే సౌకర్యాలను ఆపివేయాలని మినిస్టర్ రివ్యూలో చెప్పినట్లు తెలిపారు. ఈ పరిణామాలను గమనించి, ఉక్కు కార్మికులందరూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

13 ఆటోలపై కేసులు



ఆటో డ్రైవర్ నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

గోపాలపట్నం: మద్దిలపాలెం, ఎన్ఏడీ ప్రాంతాల్లో బుధవారం రవాణా శాఖ అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 13 స్కూల్ ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు ఉపరవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. ఈ నెల 11 నుంచి చేపట్టిన తనిఖీల్లో 36 ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులు, విద్యార్థులను ఎక్కించవద్దని సూచించారు. తనిఖీల్లో అధికారులు రాజారావు, గణేష్ రెడ్డి, మాధవి, ఎస్.శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

ఎన్ఏడీలో ప్రత్యేక తనిఖీలు

రహదారి భద్రత నిబంధనలు పాటించని ద్విచక్ర వాహనాలపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఎన్ఎస్టీఎల్ నుంచి వంటిల్లు వైపునకు రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాలు, ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై వెళ్లే వాహనాలను తనిఖీ చేసి.. 38 వాహనాలపై కేసులు నమోదు చేశారు. వాహనచోదకులకు అవగాహన కల్పించారు. భారీ వాహనాలు మాత్రమే ఫ్లైఓవర్‌పై వెళ్లాలని డీటీసీ సూచించారు. అధికారులు రామ్‌కుమార్, సుధీర్, ఏఎస్ ప్రకాష్‌రావు, శిరీష, శిరీషాదేవి తదితరులు పాల్గొన్నారు.